# బోనస్

## శశిశ్రీ

చదువుతున్న పత్రికను విసిరికొట్టేడు ఆనందరావు.

"ఏమిటి....ఈ పత్రికలు ఇలా తయారవుతున్నాయి. కథల్లో విపరీతమైన శృంగార వర్ణనలు. ప్రజలను తప్పుదారి పట్టించే రాజకీయ వ్యాఖ్యలు. అసభ్యమైన సినిమాఫొటోలు.... ఈ పత్రికలు యిలా వస్తూవుంటే దేశం ఏమయ్యేట్టు" అని తనలో తను వాపోయాడు.

తనకోసం టీ తీసుకువచ్చిన జానకితో ఆ విషయమే చెప్పాడు ఆనందరావు.

"ఆ....మీదంతా చాదస్తం....అన్ని వార పత్రికల్లోకి యెక్కువ అమ్ముడుపోయేది ఇదే.. బాగోలేకపోతే, అందరూ ఎందుకు కొంటారు? ఐనా మీ కథలు యీ పత్రికలో చాలాసార్లు పడ్డాయి కదా....మీ కెందుకు ఆ పత్రికమీద అంత కోపం...." అన్నది జానకి.

ఆమె మాటలకు విస్తుపోయాడు ఆనందరావు. ఆమెతో యీ విషయం మాట్లాడడం అనవసరమనిపించి వూరుకున్నాడు.

పడగ్గదిలోని పడక్కుర్చీలోంచి లేచి, బాల్కనీ దగ్గరకు వచ్చాడు. జానకి కూడా బాల్కనీ దగ్గరకు వచ్చి, కింద ఆడుకుంటున్న ముగ్గురు పిల్లల్ని టీకి పిలిచింది.

ఆ మేడకు ఎదురుగా వున్న గోడమీద కొత్త సినిమాపోస్టరు అంటిస్తూంటే, పిల్లలు చుట్టూ గుమికూడి చూస్తున్నారు.

అర్ధనగ్నంగా, గాలిలోకి ఎగురుతున్నట్లు, జనాన్ని వెక్కిరిస్తున్నట్లున్న అమ్మాయి బొమ్మ అది! ఆనందరావు బరువుగా నిట్టూర్చాడు.

దేశంలో ఏదీ సజావుగా జరగడంలేదన్న ఆలోచనలతోనే-ఆ ఆదివారం - ఆనందరావుకు వీడ్కోలు చెప్పి వెళ్ళిపోయింది.

※ ※ ※

మర్నాడు....

ఆనందరావు కలలో కూడా ఊహించని పరిణామాన్ని ఎదుర్కోవలసి వచ్చింది. ఆఫీసు కాంపౌండ్‌లోకి అడుగు పెడుతుండగానే, కంపెనీని మూసివేయబోతున్నట్లు కొందరు అనుకుంటూ వుండడం విన్నాడు. ఐతే-ఆ సంగతి నమ్మడానికి అతని మనసు అంగీకరించలేదు.

ఆ మధ్యాహ్నం మేనేజింగ్ పార్ట్‌నర్ ఉద్యోగులందరినీ తన 'ఎర్ కండిషన్డు' గదికి ఆహ్వానించి-'చావు కబురు' చల్లగా చెప్పాడు. తమ కంపెనీ యింతవరకు కొనుగోలు చేసి, విక్రయిస్తున్న సరకులపైగల 'లైసెన్సు'ను ప్రభుత్వం రద్దుచేసిందని, అంచేత కంపెనీని మూసివేయవలసి వస్తోందని, అందరికి రూల్స్ ప్రకారం—ఇవ్వవలసినదంతా యిచ్చేస్తామనీ-ప్రకటించాడు.

ఆనందరావుకు—ఉన్నట్టుండి తనను ఓ అగాధంలోకి తోసేసినట్లయింది. మరు క్షణం—అప్పులవాళ్ళు, ఇల్లు గడిచే విధానం, పిల్లల భవిష్యత్తు—ఈ మూడు ప్రశ్నలు అతని ముందు పెనుభూతాల్లా నిలిచాయి.

ఆ సాయంత్రమే—కంపెనీవారు ముట్టజెప్పిన—మూడు వేల, ఐదువందల రూపాయల బరువుతో—బరువెక్కిన హృదయంతో—





ఇంటికి చేరుకున్నాడు ఆనందరావు.

అప్పటికే అతనికోసం ఎదురు చూస్తూ—వరండాలో కూర్చునివున్నారు ముగ్గురు అప్పుల వాళ్ళు.

"వాళ్ళ భయం వాళ్ళది .... ఉద్యోగం పోయాక, అప్పటికప్పుడు అప్పులు వసూలు చేసుకోవడం మంచిదని అనుకొని వుంటారు!"

ఆనందరావు విషాదంగా నవ్వుకొని, వాళ్ళ లెక్కలు చూసి, రెండువేల రూపాయల పైచిలుకు అప్పు—తీర్చేశాడు.

అంత డబ్బును భర్త ఒక్కసారిగా వాళ్ళకు యిచ్చేస్తుంటే—ఆశ్చర్యంతో అలా చూస్తూ వుండిపోయింది జానకి—'ఒకవేళ ఏదైనా 'లాటరీ' తగిలిందేమో'— అనుకుంటూ.

వాళ్ళు వెళ్ళిపోయిన తర్వాత, ఆ సంగతే ఉత్సాహంగా అడిగింది.

ఆనందరావు అసలు విషయం చెప్పగానే—ఆమె గుండె గుభేలుమంది. భర్త'మూడ్' చూసి, ఆ సమయంలో ఇంకేమీ మాట్లాడడానికి సాహసించలేకపోయింది.

※ ※ ※

"జానకీ....భోజనాలయ్యాయా? మీ ఆయన గారు యేం చేస్తున్నారు?"—పక్క 'ఫ్లాట్' ఆవిడ గొంతు....

"ఆ....ఏం చేస్తారు....నిద్రపోతున్నారు.... అంతకు మించిన పనేమీ లేదుగా...."

"ఆ....ఇదిగో....ఈ నెక్లెస్ చూశావా.... మా ఆయన పాతది అమ్మేసి, పన్నెండు వందలు ఖర్చుపెట్టి, యిది చేయించారు...."

"అలాగా....బావుంది....'డిజైను' కూడా చాలా కొత్త రకంగా వుంది...."

"మా ఆయన సెలక్షన్ మరి....ఆయన ఇలాంటి విషయాల్లో భలే లౌక్యుడు. చేసేది కార్పొరేషను బిల్లు కలెక్టరు ఉద్యోగం అయినా పై డబ్బులు భలే తెలివిగా సంపాయిస్తారు.... అవునూ....మీ ఆయనదీ 'పర్చేజ్ డిపార్ట్

మెంట్'లో చాలా ముఖ్యమైన ఉద్యోగమే కదా ....కంపెనీ మూసేస్తే మూసేశారు....ఆయన ఏమైనా పై డబ్బులు వెనకేశారా?"

"అయ్యో .... అంత తెలివి కూడానా.... ఎంతసేపు ఆదర్శాలు వల్లించడంతోనే ఆయనకు సరిపోతుంది...."

అంతసేపు నిద్రపట్టక—అటు ఇటు దొర్లుతున్న ఆనందరావు—ఆ పైన జానకి మాటలు వినలేకపోయాడు.

తనను, తన ఆదర్శాలను మెచ్చుకొని, ప్రేమించి, పెళ్ళి చేసుకున్న జానకి....ఇప్పుడిలా మాట్లాడుతోంది!

గబ గబా—బట్టలు వేసుకుని, ఇంట్లోంచి బయటపడ్డాడు!

* * *

ఆ పత్రిక—ఎడిటోరియల్ కార్యాలయం—పూర్తిగా 'ఏర్ కండిషను' చెయ్యబడి వుంది! 'విజిటర్స్ రూమ్'లో ఆనందరావు ఒక్కడే కూర్చున్నాడు.


"ఆ వెధవ వుద్యోగం పోతే పోయింది. ఈ పత్రిక ఆఫీసులో అసిస్టెంట్ ఎడిటర్ ఉద్యోగం దొరికితే బావుణ్ను....తనకు నచ్చిన ఉద్యోగం....తన అభిరుచులకు అనుగుణంగా దేశానికి ఉపయోగపడే పని కొంతైనా చేయడానికి అవకాశం వుంటుంది...." రక రకాల ఆలోచనలతో-ఎడిటర్ రామనాథం పిలుపు కోసం ఎదురుచూడసాగాడు.

ఓ అరగంట తర్వాత—పిలుపు వచ్చింది. ఎడిటర్‌గారి గది మరింత చల్లగా వుంది. ఆయనకు నలభై ఐదేళ్ళ వయసు వుంటుందేమో. కాళ్ళజోడులోంచి—ఓరగా ఆనందరావువైపు చూసి, నమస్కారానికి—ప్రతినమస్కారం చేసి, కూర్చోమన్నాడు.

"చూడండి .... మిస్టర్ ఆనందరావ్.... మీకు ఉద్యోగం యిస్తే—అసిస్టెంట్ ఎడిటర్‌గా మీరు కొన్ని ముఖ్యమైన బాధ్యతలు నిర్వహించవలసి వుంటుంది. పత్రిక సర్క్యులేషన్ పెరగడానికి మీరు చాలా కృషి చేయవలసి వుంటుంది. మా పత్రికను మీరు చూస్తూనే ఉన్నారుగా....మీ కథలు కొన్నిటిని మేము ప్రచురించాము కూడా....ఐతే రచయితకు, జర్నలిస్టుకు బాధ్యత విషయంలో కొన్ని తేడాలు వుంటాయి. ఆ సంగతి మీకు తెలిసేవుంటుంది....మీకు అవకాశం యిస్తే—పత్రికను అభివృద్ధి చేయడానికి మీరు యేం చేస్తారు?" అంతసేపు మాట్లాడినందుకు అలిసిపోయినట్లుగా, మంచినీళ్ళు తాగి, సిగరెట్ వెలిగించాడు రామనాథం.

ఆనందరావుకు ఎక్కడలేని ఉత్సాహం, ఆవేశం వచ్చాయి. తన ఆశయాలన్నిటినీ—క్లుప్తంగా వివరించాడు. ఆనందరావు చెప్పినదంతా విని, రామనాథం చిరునవ్వు నవ్వాడు.

"వెల్....వ్యక్తిగతంగా మీకున్న అభిరుచులు చెప్పారు. పర్సనల్‌గా నేను మిమ్మల్ని మెచ్చుకోగలను. కానీ, ఇది మన సంస్థ నిర్వహిస్తున్న పత్రిక. ప్రొప్రయిటరుగారు భారీగా పెట్టుబడి పెట్టి, కొన్ని ప్రయోజనాలకోసం—ఈ పత్రికను నడుపుతున్నారు. అంచేత—వారి ఉద్దేశాలకు తగినట్లుగానే మనం వ్యవహరించాలి. ఉదాహరణకు మన బాసానుబాసుడు ఒక పార్టీకి మద్దతు యిస్తే, అప్పుడు ఆ పార్టీకి అనుకూలంగానే, మనం అన్ని విషయాలు ప్రచురించాలి. ఒకవేళ ఆయన తన వుద్దేశాన్ని మార్చుకుని, మరో పార్టీకి మద్దతు యివ్వడం ఆరంభిస్తే—వెంటనే మనమూ పద్ధతిని మార్చుకోవాలి. పత్రిక అమ్మకాలు పెరగాలంటే కొన్ని కిటుకులున్నాయి. ఉదాహరణకు అప్పుడప్పుడు మనమే కొన్ని రచనలు చేస్తూ అక్కడక్కడా సెక్సు గుప్పించాలి. లేదా అలా రాసే రచయిత్రిని కాని, రచయితని గాని పట్టుకుని వాళ్ళకు ఎంతయినా పారితోషికం యిచ్చి, మాంచి మసాలా రచనను — సీరియల్‌గా ప్రారంభించాలి. మనకు యెలాంటి పోజులు కావలిస్తే అలాంటి పోజులు యిచ్చి, ఫొటోలు తీయించుకునే సినిమా అమ్మాయిలు బోలెడుమంది వున్నారు. వాళ్ళ బొమ్మలు అప్పుడప్పుడు




వేస్తూవుండాలి....ఇవన్నీ చేస్తుంటేనే అమ్మకాలు పెరుగుతాయి. మీరు బాగా రాస్తారని నాకు తెలుసు. అంచేత—మీ దరఖాస్తుకు యెక్కువ ప్రాధాన్యం చూపాను. మీరు ఈ పద్ధతులకు 'ఎడ్జస్టు' కాగలిగితే, వచ్చే నెల మొదటి తేదీనుంచి—ఉద్యోగంలోకి 'జాయిన్' కావచ్చు. ఏ సంగతీ మీరు ఓ వారం రోజుల్లో చెప్పండి!" అన్నాడు-రామనాథం-ఏదో 'ఫైల్' తిరగేస్తూ.

ఆనందరావు-ఆయనవైపు అదోలా చూసి సెలవు తీసుకుని, విజిటర్స్ రూమ్‌లోకి వచ్చి కూర్చున్నాడు. ఆ క్షణంలో ఎన్నెన్నో ప్రశ్నలు—అతన్ని చుట్టుముట్టి, బుర్రను వేడెక్కించాయి. కాని, ఆ గదిలోని చల్లదనం—అతన్ని మత్తులా ఆవరించింది. వెంటనే ఆ గదిని వదిలిపెట్టాలని అతనికి అనిపించలేదు!

పని అయిపోగానే వెళ్ళిపోకుండా, మళ్ళీ అక్కడికే వచ్చి కూర్చున్న ఆనందరావును ఆ ఆఫీసు ప్యూన్ వింతగా చూశాడు!

* * *

"మిస్టర్ ఆనందరావ్ .... వచ్చిన ఒక్క సంవత్సరంలోనే మంచి రిజల్టు చూపించావ్... మన బాసాను బాసుడు చాలా సంతోషించాడు. నీకు మంచి 'ఇంక్రిమెంటు' కూడా వస్తుందిలే, ఊ....మరో పెగ్గు లాగించు...." ఆనందరావు వద్దంటున్నా విస్కీని గ్లాసులోకి వంపాడు రామనాథం.

"చూడు....ఆనందరావ్....జీవితంలో ఒకోసారి మనం రాజీ పడకలేకపోతే — మనకు యెవరూ విలువ యివ్వరు....చూడు మనకు 'బాసు' ఎలాంటి ట్రీట్‌మెంట్ యిస్తున్నాడో.. ఈరోజు 'బాసు' పుట్టినరోజు పార్టీకి మన ఆఫీసులో యెవరినైనా పిలిచాడా....మనల్ని మాత్రం ఆహ్వానించాడు .... అదే మన ప్రెస్టేజ్...." మత్తులోవున్నా సరిగ్గా మాట్లాడడానికి ప్రయత్నించసాగాడు రామనాథం.

ఆనందరావు—చిప్స్ తింటూ, విస్కీ సిప్ చేస్తూ ఆయన మాటలు శ్రద్ధగా వింటున్నాడు. లోలోపల ఏదో మేఘాలలో తేలుతున్నట్లుగా వుంది—అతని పరిస్థితి!

"మే ఐ హెల్ప్ యు—" రాకెట్‌లా వచ్చింది బాస్‌కు పెర్సనల్ సెక్రటరీ అయిన లిల్లీ. జవాబుకోసం ఎదురుచూడకుండా, విస్కీని గ్లాసుల్లోకి వంచసాగింది.

ఆమె వంపులు ఆ ఇద్దరి మెదలనూ వంచాయి!

"హెల్ప్ మిస్టర్ ఆనందరావ్" అని మెల్లగా కన్ను గీటాడు రామనాధం.

లిల్లీ నవ్వుతూ ఆనందరావువైపు చూసి నవ్వింది. "డోంట్ వర్రీ.... మిమ్మల్ని నేను మీ యింట్లో 'డ్రాప్' చేస్తాను....కారీ....ఆన్" అతని పక్కకు వచ్చి కూర్చుంది.

గుప్పుమన్న విదేశీ సెంటు పరిమళం—అతన్ని ఒక్కసారి కౌగలించుకుని, ఉక్కిరి బిక్కిరి చేసింది. ఆనందరావుకు స్వర్గంలో వున్నట్లనిపించింది!

* * *

కారు వెనకసీట్లో- ఒళ్ళో పడుకున్న ఆనందరావు తన యిల్లు తొందరగా రాకుండా వుంటే బాగుండునని కోరుకోసాగాడు. లిల్లీ అతని పెదాలకు అద్దుకున్న లిప్‌స్టిక్ - జేబు రుమాలుతో తుడవడంలో నిమగ్నురాలయింది!

ఆ అర్ధరాత్రి-పడకగదిలో - తన పక్కనే పడుకునివున్న జానకిని మత్తుగా చూశాడు ఆనందరావు. నిద్రలో ఆమె నవ్వుకుంటూ వుంది .... బహుశా రేపు పక్కింటావిడకు చూపించబోయే-తన కొత్త నెక్లెస్ గురించి తలచుకుని వుంటుంది!

ఆనందరావుకు ఉన్నట్టుండి ఏడుపొచ్చింది. ఏడుస్తూనే-నిద్రపోయాడు!

* * *

ఆనందరావు పుణ్యాన కొత్త రంగులు సంతరించుకుంటూ-పాఠకులను వెర్రెక్కిస్తోన్న ఆ వార పత్రికను కోపంతో విసిరికొట్టాడు ఆ యువకుడు. కాస్సేపాగి, ఆ పత్రికను ముక్కలు ముక్కలుగా చించి, అగ్గిపుల్ల వెలిగించి, తగలబెట్టాడు.

"అంతా మోసం....దగా....అన్నీ అబద్ధపు రాతలు....ప్రజల బలహీనతతో ఈ పత్రికల వాళ్ళు ఆడుకుంటున్నారు," ఆవేశంతో అతను అగ్నిపర్వతమే అయ్యాడు.

ఒక్క పుస్తకాన్నయితే, తను తగులబెట్టగలిగాడు....కాని ఇలాంటి పత్రికలు వేల సంఖ్యలో, పఠితల మస్తిష్కాలలో మత్తుమందును ఎక్కిస్తూ, ఎందరినో నిర్వీర్యులుగా చేస్తున్నాయి. వాళ్ళలో యెవరివల్లనైనా, ఏ కొద్దిమందికైనా హాని జరగవచ్చు. ఈ ప్రమాదం జరగకుండా వుండాలంటే, యేం చేయాలి?

చెయ్యాలి....ఏదో చెయ్యాలి....

ఉద్వేగంతో - తన గదికి తాళం వేసుకుని, బయలుదేరాడు.

అతను విద్యాధికుడు....నిరుద్యోగి....ఆలోచనలు....ఆవేశం....ఆదర్శభావాలూ వున్న యువకుడు.

అతను ఏం చేస్తాడు?

ఏమో....

చుట్టూ యెన్నో బోన్లు వున్నాయి....అతను ఏ బోనులో పడతాడో....లేక .... బోనులలో పడ్డవాళ్ళను కాపాడతాడో....చూడాలి! □

జ్యోతి నవలల పోటీలో
రెండవ బహుమతి పొందిన నవల
**'ఆకాశానికి అటూ ఇటూ'**
వచ్చే సంచిక నవలానుబంధంలో చదవండి!



